GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

T MEDIA

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 6 | సంచిక : 295 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | శనివారం 15-06-2024 | పేజీలు : 3

## నీట్ కుంభకోణానికి ముగింపు పలకాలి

### సీఎం స్టాలిన్



**టీ మీడియా, జూన్ 14,చెన్నై :**
నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) కుంభకోణానికి ముగింపు పలకాలని తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే నేత ఎంకే స్టాలిన్ శుక్రవారం అన్నారు. చెన్నైలోని జవహర్లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సీఎం స్టాలిన్ మాట్లాడుతూ.. ఎవరూ మన దగ్గర దోచుకోలేని ఏకైక ఆస్తి చదువు. కానీ అందులోనూ నీట్ లాంటి మోసాలు ఉన్నాయి. అందుకే దీన్ని వ్యతిరేకిస్తున్నాం. నీట్ లో అక్రమాలు జరుగుతున్నాయని తమిళనాడు తొలుత చెప్పింది.. ఇప్పుడు దేశం మొత్తం దీనిని సమర్థిస్తోంది. ఎటువంటి ఆర్థిక, రాజకీయ పరిస్థితులు విద్యార్థుల చదువుకు అడ్డంకి కాకూడదన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సోషల్ మీడియా పోస్ట్లో "నీట్ అభ్యర్థుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు కేంద్రప్రభుత్వం కట్టుబడి ఉంది. విద్యార్థులు దేనికోసం ఆందోళనలు చేపడుతున్నారో వాటిని న్యాయంగా పరిష్కరిస్తామని నేను వారికి హామీ ఇస్తున్నాను. ఏ విద్యార్థికీ నష్టం జరగదు. వారి భవిష్యత్తు ప్రమాదంలో పడదు" అని వ్యాఖ్యానించారు. 2024లో నీట్-యూజీ 1,563 ఇచ్చిన గ్రేస్ మార్కులను తీసేస్తామని కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. జూన్ 23న వారికి మళ్లీ పరీక్ష రాసే అవకాశాన్ని కల్పిస్తామని పేర్కొంది.

# కువైట్‌లో అగ్నిప్రమాదం

- ఏపీ వాసులు మృతి
- స్వదేశానికి 45మంది భారతీయుల మృతదేహాలు

**టీ మీడియా, జూన్ 14, కువైట్ సిటీ :**
గత బుధవారం తెల్లవారుజామున కువైట్‌లోని ఒక అపార్ట్‌మెంట్‌లో జరిగిన ఘోర అగ్ని ప్రమాదంలో 49 మంది మరణించారు. మరో 50 మంది వరకు గాయపడ్డారు. మృతుల్లో 45 మందిని భారతీయులుగా అధికారులు గుర్తించారు. ప్రస్తుతం ఆ మృతదేహాలను వాయుసేన విమానంలో కేరళలోని కొచ్చి అంతర్జాతీయ విమానాశ్రయానికి తీసుకువచ్చారు. శుక్రవారం ఉదయం ఆ విమానం చేరుకుంటుందన్న సమాచారంతో బాధిత కుటుంబాలు ఎయిర్‌పోర్టుకు వచ్చాయి. దీంతో ఆ ప్రాంతమంతా ఉద్విగ్న భారభరితంగా మారిపోయింది. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, కేంద్రమంత్రి సురేశ్ గోపి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కే సురేంద్రన్‌తో పాటు పలువురు విమానాశ్రయంలో ఉన్నారు. అయితే మధ్యాహ్నం సమయంలో ఆ విమానం 45 మంది మృతదేహాలతో కొచ్చి విమానాశ్రయానికి చేరుకుంటుంది. ఆ తరువాత మృతదేహాలను ఢిల్లీకి తీసుకెళ్లి.. ఢిల్లీ నుంచి వారివారి స్వస్థలాలకు మృతదేహాలను తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.కువైట్ అగ్నిప్రమాదంలో మృతిచెందిన భారతీయులు 45 మందికాగా.. వారిలో కేరళ (23), తమిళనాడు (7), ఎపి (3), యుపి (3), ఒడిషా (2), బీహార్, పంజాబ్, కర్నాటక, బెంగాల్, తదితర రాష్ట్రాలకు చెందినవారు మరికొందరున్నారు. మృతుల్లో ఎపికి చెందిన వారు ముగ్గురు ఉండగా.. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గం పెరవల్లి మండలానికి చెందిన ఇద్దరు ఆ దుర్ఘటనలో సజీవదహనం అయ్యారు. అన్నవరప్పాడుకు చెందిన మీసాల ఈశ్వర్, ఖండవల్లికి చెందిన ముల్లేటి సత్యనారాయణ అగ్నిప్రమాదంలో మరణించారు. దీంతో ఆ రెండు గ్రామాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి. కువైట్ అగ్ని ప్రమాదంలో ఉద్దానం వాసికూడా మృతిచెందారు. శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం జింకబద్ర గ్రామంకు చెందిన తామాడ లోకనాదం నాలుగేళ్లుగా కువైట్‌లో పని చేస్తున్నాడు. గత నెలలో సొంత గ్రామానికి వచ్చిన



అతను.. ఈనెల 11వ తేదీన తిరిగి కువైట్ కు వెళ్లాడు. ఘటన జరిగిన ముందురోజు రాత్రే కంపెనీ అపార్ట్ మెంట్‌కు లోకనాథం చేరుకున్నారు. కంపెనీ రిజిస్టర్ లో ఎంట్రీ లేకపోవడంతో లోకనాదం మరణించినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నాలుగేళ్లుగా కువైట్ ఎన్‌బీటీసీ సంస్థలో లోకనాథం పనిచేస్తున్నాడు. లోకనాథం మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. గ్రామంలోనూ విషాదం నెలకొంది. ఈ అగ్నిప్రమాదం సమయంలో తెలంగాణకు చెందిన మరో ముగ్గురు భవనంపై నుంచిదూకి స్వల్ప గాయాలతో ప్రాణాలతో బయటపడ్డారు.

### అగ్ని ప్రమాదంలో ఏపీ వాసులు మృతి

**పెరవలి మండలం (తూర్పుగోదావరి జిల్లా) :**
కువైట్ అగ్ని ప్రమాదంలో ఇద్దరు ఆంధ్రప్రదేశ్ చెందిన వారు మృతి చెందారు. బ్రతుకు దెరువు కోసం పొట్ట చేత పట్టుకుని గల్ఫ్ కంట్రీ కువైట్ దేశం వెళ్లిన వ్యక్తులు భారతీయ కార్మికులు నివాసముండే బహుళ అంతస్థ భవనంలో భారీ అగ్ని ప్రమాదంలో మృత్యువాత పడ్డారు. వివరాల్లోకి వెళితే.. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలంలోని అన్నవరప్పాడు ఖండవల్లి గ్రామాలకు చెందిన ఇరువురు వ్యక్తులు ఇటీవల కువైట్ దేశంలో బహుళ అంతస్థ భవనంలో బుధవారం జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో మృతి చెందారు. పోలీసుల తెలిపిన వివరాలు ప్రకారం ఖండవల్లి గ్రామానికి చెందిన మొల్లేటి ముక్తేశ్వరరావు భార్య రాఘువులు గ్రామంలో వ్యవసాయ కూలీలుగా పనిచేస్తున్నారు. 2వ కుమారుడు మొల్లేటి సత్యనారాయణ వయసు(38) ఇతనికి సుమారు 20 సంవత్సరాలు క్రితం అనంతలక్ష్మితో వివాహం అయినది వీరికి వెంకట సాయి వయసు(19) కుమారుడు ఉన్నాడు. ఇతను ఉపాధి నిమిత్తం 12 సంవత్సరాల క్రితం కువైట్ దేశం వెళ్లి ఒక సూపర్ మార్కెట్ లో హెల్పర్ పనిచేస్తు అక్కడ వచ్చే జీతంతో కుటుంబాన్ని పోషించుకుంటూ 2 లేక 3 సంవత్సరాల ఇండియాకు వస్తున్నాడు. ఈ మధ్యకాలంలో గ్రామంలో సొంత ఇల్లు నిర్మాణం చేస్తే గృహప్రవేశంనకు వచ్చి వెళ్ళాడు. బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో అగ్నికీలలకు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నేరుగా విలపిస్తున్నారు.పదేళ్ల క్రితం అన్నవరప్పాడు గ్రామానికి చెందిన నారాయణరావు సీతామాలక్ష్మి దంపతుల కుమారుడు మీసాల ఈశ్వరుడు వయసు(40) ఇతను కూడా అగ్ని ప్రమాదంలో చనిపోయారు. ఇతను పెద్దగా చదువుకోలేదు. వ్యవసాయ కూలీ పనులు చేస్తూ 10 సంవత్సరాల క్రితం కువైట్ దేశం వెళ్లారు. అప్పటి నుండి అక్కడ సూపర్ మార్కెట్లో చేస్తున్నారు. తన భార్య చిట్టి కాసులు, కుమారుడు సాయి మణికంఠ, కుమార్తె కోమలి కృష్ణ కుమారి. ఇంటికి పెద్ద దిక్కు కోల్పోవడంతో కుటుంబం శోక సముద్రంలో మునిగిపోయింది.





### పూర్తి స్థాయి బడ్జెట్‌పై

## ఆర్థికశాఖ కసరత్తు

### 18 నుంచి శాఖల వారీగా సన్నాహక సమావేశాలు

### అధికారులతో వరుస సమీక్షలు

**టీ మీడియా, జూన్ 14,హైదరాబాద్:**
తెలంగాణ ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్‌పై కసరత్తు చేస్తోంది. జూన్ 18 నుంచి శాఖల వారీగా సన్నాహక భేటీలు నిర్వహిస్తోంది. తెలంగాణ పూర్తి స్థాయి బడ్జెట్‌పై ఆర్థికశాఖ కసరత్తు మొదలుపెట్టింది. ఈనెల 18 నుంచి శాఖల వారీగా బడ్జెట్ సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. దీని కోసం ఉపముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క.. ఆధ్వర్యంలో శాఖల వారీగా మంత్రులు, కార్యదర్శులు, హెచ్ఓడీ లతో సమావేశాలు జరుగుతాయని తెలిపింది. ఈనెల18న వ్యవసాయ, చేనేతశాఖల ప్రతిపాదనలపై చర్చించనున్నారు. జూన్ 21న రెవెన్యూ, గృహనిర్మాణం, ఐఅండ్ పీఆర్, పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమం, వైద్య-ఆరోగ్య శాఖలతో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొంది. జూన్ 22న సినిమాటోగ్రఫీ, ఐటీ, ఆర్అండ్‌బీ, పరిశ్రమల శాఖ పై చర్చించనున్నారు. జూన్ 26న నీటిపారుదల, పౌరసరఫరాలు, అటవీ, దేవాదాయశాఖలపై సమావేశం నిర్వహించనున్నారు. జూన్ 27న రవాణా, బీసీ సంక్షేమం, ఎక్సైజ్, పర్యాటకశాఖల ప్రతిపాదనలపై చర్చిస్తారని తెలుస్తోంది.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్ద ఉన్న శాఖలపై జూన్ 28 నుంచి జూలై 1 వరకు సమావేశాలు జరుగనున్నాయి. 2024-25 ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఆయాశాఖల పరిధిలోని పథకాల వ్యయ ప్రతిపాదనలను క్షుణ్ణంగా సమీక్షించాలని ఆర్థికశాఖ పేర్కొంది. ఆయాశాఖల పరిధిలోని పథకాల వ్యయానికి సంబంధించిన ప్రతిపాదనలపై చర్చించి పద్దులను సిద్ధం చేయనున్నారు. ఇటీవలి ప్రభుత్వ ప్రకటనలను దృష్టిలో ఉంచుకొని కొత్త పథకాలకయ్యే ఖర్చు వివరాలను ప్రత్యేకంగా రూపొందించాలని ఆర్థికశాఖ స్పష్టం చేసింది. జులై నెలాఖరులోగా పూర్తిస్థాయి వార్షిక బడ్జెట్ ఉభయసభల ఆమోదం పొందాల్సి ఉంది. ఇందుకోసం వచ్చేనెల మొదటివారంలో బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యే అవకాశం కనిపిస్తోంది. ఆ మేరకు రాష్ట్రఆర్థికశాఖ పద్దు కసరత్తు ప్రారంభించింది. పూర్తిస్థాయి బడ్జెట్ రూపకల్పనలో భాగంగా అన్ని శాఖల నుంచి ఇప్పటికే ఆర్థికశాఖ ప్రతిపాదనలను కోరింది. ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి సంబంధించి ఆయా శాఖల పనితీరు నిర్దేశించిన లక్ష్యాల వివరాలను ఇవ్వాలని స్పష్టం చేసింది.

## కాళేశ్వరం ప్రాజెక్టుపై కొనసాగుతున్న విచారణ

### కేసీఆర్, హరీష్ రావులకు నోటీసులు..?



**టీ మీడియా, జూన్ 14,కాళేశ్వరం :**
ప్రాజెక్టుపై బహిరంగ విచారణకు రెడీ అవుతోంది జస్టిస్ చంద్రఘోష్ కమిషన్. ఈ ఎపిసోడ్‌లో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్‌కు నోటీసులు ఇవ్వబోతోందని టాక్. త్వరలో మరోసారి ఆకస్మిక పర్యటనలకు రెడీ అవుతోంది కమిషన్. నిన్న హైడ్రాలజీ, నిపుణుల కమిటీలను విచారించిన జస్టిస్ ఘోష్.. ఇంకొందరిని పిలిచింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై వచ్చిన ఆరోపణలపై జస్టిస్ చంద్రఘోష్ కమిషన్ విచారణ వేగవంతంగా కొనసాగుతోంది. హైడ్రాలజీ, నిపుణుల కమిటీ ఇంజినీర్లను కమిషన్ విచారించింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో తాము ఐడెంటీఫై చేసిన అంశాలను వివరించిన రెండు కమిటీలు.. ఎక్కువ నీటిని నిల్వ చేయడం వల్లే సమస్య తలెత్తిందని చెప్పినట్టు తెలుస్తోంది. రెండు వారాల లోపు మధ్యంతర నివేదిక, సాధ్యమైనంత త్వరగా పూర్తిస్థాయి నివేదికను అందించాలని రెండు కమిటీల ఇంజినీర్లను కమిషన్ ఆదేశించింది. టెక్నికల్ అంశాలపై అఫిడవిట్ ఫైల్ చేయాలని నిపుణుల కమిటీలకు సూచించింది. అఫిడవిట్ల పరిశీలన తర్వాత బహిరంగ విచారణ చేసేందుకు జస్టిస్? పీసీ ఘోష్? సిద్ధమవుతున్నారు. ఇందులో సంబంధం ఉన్న వారికి నోటీసులు ఇచ్చేందుకు గ్రౌండ్ వర్క్ కూడా ప్రిపేర్ చేస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ నీటిపారుదల మంత్రి హరీష్‌కు నోటీసులు ఇచ్చే అవకాశాలున్నట్టు టాక్ వినిపిస్తోంది.మరోవైపు.. విజిలెన్స్? ఇచ్చిన మధ్యంతర నివేదిక సమర్పించాలని గతంలోనే కమిషన్? ఆదేశించినా.. అది ఇప్పటివరకు చేరలేదు. రిపోర్ట్ వెంటనే సమర్పించాలని మరోసారి ప్రభుత్వానికి, విజిలెన్స్ విభాగానికి లేఖ రాయనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి జస్టిస్? పీసీ ఘోష్? ఆకస్మిక పర్యటనలకు వెళ్లాలని భావిస్తున్నట్టు సమాచారం. టెక్నికల్ అంశాల తర్వాత ఆర్థిక అంశాలపై కమిషన్? దృష్టి సారించనుంది కమిషన్. ఆనకట్ట నిర్మాణ అంచనాలు, రుణాలు, వడ్డీ రేట్లపై విచారణ చేయనుంది. విచారణలో భాగంగా ఇటీవల ఎల్ అండ్ టి నవయుగ, ఆఫ్కాన్ కన్‌స్ట్రక్షన్ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యాయి. ఆరోపణలపై కమిషన్ వివరణ కోరగా.. తమకు టైం బౌండ్ పెట్టారని నిర్మాణం కంపెనీలు చెప్తున్నాయి.. ప్రభుత్వం విధించిన సమయంలో ప్రాజెక్టు పూర్తిచేసి అందించామని అంటున్నాయి. ఇదే విషయం అఫిడవిట్ రూపంలో సమర్పించాలని కమిషన్ సూచించింది. అఫిడవిట్‌లో సమాచారంతో విచారణను తప్పుదోవ పట్టించాలని చూస్తే మాత్రం తీవ్ర పరిణామాలు ఉంటాయని అధికారులను హెచ్చరించింది కమిషన్. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై రిపోర్ట్ ఇచ్చేందుకు జూన్ 30న డెడ్ కావడంతో నిర్మాణ కంపెనీలు, అధికారులు, సంబంధిత వ్యక్తుల నుంచి అన్ని వివరాలు సేకరిస్తోంది కమిషన్. శుక్రవారం మరికొంతమంది అధికారులను, ఇతర వ్యక్తులను విచారించనుంది కమిషన్.

## ఢిల్లీలో దుమ్ము తుఫాను



**టీ మీడియా, జూన్ 14,హైదరాబాద్:** ప్రపంచంలోని కాలుష్య నగరాల్లో టాప్ స్థానంలో ఉన్న దేశ రాజధాని ఢిల్లీలో శుక్రవారం సాయంత్ర దుమ్ము తుఫాన్ వచ్చింది. సాయంత్రం 6 గంటలకు ఢిల్లీ-ఎన్‌సిఆర్‌లో దుమ్ము తుఫాను కారణంగా ఢిల్లీలో జనజీవనం అస్తవ్యస్తమైంది. రోడ్లు కూడా సరిగా కనిపించకుండా దుమ్ము తుఫాన్ ప్రజలను ఇబ్బందులకు గురిచేసింది. ముఖ్యంగా బాగా మాత్రం ముందు ఏమీ కనిపించక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం ఢిల్లీలో తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అంచనా వేసిన సంగతి తెలిసిందే. వేడీ తీవ్రతతో బాధపడుతున్న ప్రజలకు ఉపశమనం కలిగించే అవకాశం ఉంది. ఢిల్లీలో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుందని, మధ్యాహ్నం, సాయంత్రం కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం లేదా చినుకులు పడే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. కొన్ని ప్రాంతాల్లో గంటకు 35 కిలోమీటర్ల వేగంతో వేడిగాలులు, బలమైన గాలులు వీస్తాయని పేర్కొంది.

### సామాన్యులకు అందుబాటులో..

## ధరణి పోర్టల్

- రెవెన్యూ ప్రక్షాళనకు చర్యలు
- రెవెన్యూ మంత్రి పొంగులేటి
- మంత్రి సమావేశమైనకమిటీ



**టీ మీడియా, జూన్ 14,హైదరాబాద్ :**
బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన ధరణి పోర్టల్ వల్ల రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలు భూ సమస్యలను ఎదుర్కొంటున్నారని, ఎన్నో కుటుంబాలు ఛిన్నాభిన్నం అయ్యాయని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత స్వయంగా తాను ఖమ్మం జిల్లాలో క్షేత్ర స్థాయిలో పర్యటించినప్పుడు ప్రతి గ్రామంలో రెండు వందల కుటుంబాలకు పైగా భూ సంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ సమస్యల నుంచి ఉపశమనం కలిగించడానికి ధరణి పోర్టల్ ను పునర్ వ్యవస్థీకరించి భూ సంబంధిత వ్యవహారాలను అందుకు సంబంధించిన చట్టాలలో మార్పులు తేవాల్సిన అవసరం ఏర్పడిందని ఈ దిశగా ఇప్పటికే అవసరమైన చర్యలు చేపట్టామని వెల్లడించారు. శుక్రవారం నాడు డా.బీ.ఆర్.అంబేద్కర్ సచివాలయంలోని తన కార్యాలయంలో మంత్రి శ్రీనివాస్ రెడ్డి గారు ధరణి కమిటీ సభ్యులు ఎం. కోదండ రెడ్డి, ఎం.సునిల్ కుమార్, మధుసూదన్ లతో సమావేశమయ్యారు. ఈ సంధర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ...గత ప్రభుత్వం ఎంతో హడావిడిగా ఎలాంటి అధ్యయనం చేయకుండా తీసుకువచ్చిన ధరణి పోర్టల్ కారణంగా ప్రజలు ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారని, ఈ సమస్యలను పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతను ఇస్తోందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రెవెన్యూ వ్యవస్థ (ధరణి) ప్రక్షాళన చేసేందుకు సత్వర చర్యలు తీసుకుంటున్నామని, ధరణి పోర్టల్ అమలు కారణంగా వచ్చిన సమస్యలను అధ్యయనం చేయడానికి అయిదుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశామని, ఈ కమిటీ చేసిన సిఫారసులపై ఈరోజు జరిగిన సమావేశంలో సుధీర్ఘంగా చర్చించామని, ఈ కమిటీ తుది నివేదిక ప్రభుత్వానికి సమర్పించేకంటే ముందు అన్నీ జిల్లా కలెక్టర్లతో సమావేశం నిర్వహించాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. ఈ కమిటీ రాష్ట్రంలో భూ సంబంధిత నిపుణులు, అధికారులతో చర్చించడంతో పాటు 18 రాష్ట్రాలలోని %=శీ=% యాక్ట్ ను క్షుణ్ణంగా పరిశీలించింది. భూమి వివాదాల పరిష్కారం కోసం రెవెన్యూ ట్రిబ్యునల్ లను ఏర్పాటు చేయాలని, భూమికి సంబంధించిన ముఖ్యమైన చట్టాలను కలిపి ఒకే చట్టంగా రూపొందించాలని కమిటీ సూచించిందని మంత్రిగారు వెల్లడించారు. లోపభూయిష్టమైన 2020 %=శీ=% చట్టాన్ని తద్వారా రూపొందించిన ధరణి పోర్టల్ ను బలోపేతం చేయడంతో పాటు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా అందరికీ సులువుగా అర్థమయ్యే రీతిలో ధరణి పోర్టల్ లో మార్పులు-చేర్పులు చేపట్టబోతున్నామని మంత్రిగారు వెల్లడించారు. గత ప్రభుత్వం పార్ట్-బి లో ఉంచిన భూ సమస్యలను పరిష్కరించడానికి ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగిందని, ఈ సమస్యల పరిష్కారానికి మరింత వేగంగా చర్యలు చేపట్టాలని సూచించారు.

## కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్ 19న విచారణ



**టీ మీడియా, జూన్ 14,న్యూఢిల్లీ :**
లిక్కర్ స్కామ్ కేసులో అరెస్టయిన ఆప్ అధ్యక్షుడు కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్‌పై జూన్ 19న విచారణ చేపడతామని ఢిల్లీ కోర్టు పేర్కొంది. ఈ వ్యవహారంలో సమాధానం ఇచ్చేందుకు సమయం కావాలని ఇడి కోరడంతో .. అదనపు సెషన్స్ జడ్జి ముకేష్ కుమార్ ఈ కేసు విచారణను వాయిదా వేశారు.విచారణ సందర్భంగా ఈ కేసును జూన్ 25కి వాయిదా వేయాల్సిందిగా ఇడి జడ్జిని కోరింది. దీంతో జూన్ 19న విచారణ చేపతామని కోర్టు పేర్కొంది. అయితే నిందితుడు జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నందున తదుపరి విచారణ సమయంలో ఆయన వివరణను పరిగణనలోకి తీసుకుంటామని జడ్జి స్పష్టం చేశారు.అలాగే, కేజ్రీవాల్ ఆరోగ్య పరిస్థితి, చికిత్సను నిర్ధారించేందుకు నియమించిన మెడికల్ బోర్డ్ చర్యల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తన భార్యను అనుమతించేలా ఆదేశించాలని కోరుతూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను శనివారానికి వాయిదా వేశారు. దీనిపై స్పందించాలని సంబంధిత జైలు అధికారులను జడ్జి ఆదేశించారు.ఈ కేసులో వైద్యపరమైన కారణాలతో మధ్యంతర బెయిల్‌ను కోరుతూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను జూన్ 5న ఢిల్లీ కోర్టు కొట్టివేసిన సంగతి తెలిసిందే.





## ఏపీ మంత్రులకు శాఖల కేటాయింపు..

### ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

**టీ మీడియా, జూన్14, అమరావతి :**
ఏపీలో ఎన్డీఏ ప్రభుత్వం కొలువుతీరిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ముఖ్యమంత్రి, మంత్రుల ప్రమాణస్వీకారం కూడా కంప్లీట్ అయింది. తాజాగా కొత్త మంత్రులకు శాఖలు కేటాయించారు. 24మందికి శాఖలు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సీనియర్లకు కీలక శాఖల బాధ్యతల్ని అప్పగించారు. మంత్రులకు కేటాయించిన

### శాఖల వివరాలు దిగువన చూడండి

చంద్రబాబునాయుడు (ముఖ్యమంత్రి) సాధారణ పరిపాలన శాఖ, శాంతిభద్రతలు, జీఏడీ, పబ్లిక్‌ఎంటర్‌ప్రైజెస్ (మంత్రులకు కేటాయించని ఇతర శాఖలు), కొణిదెల పవన్కళ్యాణ్(ఉపముఖ్యమంత్రి) - పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, రూరల్ వాటర్ సప్లై, పర్యావరణం, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, నారా లోకేష్ - మానవ వనరులు, ఐటీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఆర్‌టీజీ, కింజరాపు అచ్చెన్నాయుడు - వ్యవసాయం, సహకారశాఖ, మార్కెటింగ్, పశుసంవర్ధకశాఖ, డెయిరీ డెవలప్‌మెంట్, మత్స్యశాఖ, కొల్లు రవీంద్ర - గనులు అండ్ జియాలజీ, ఎక్సైజ్,నాదెండ్ల మనోహర్ - ఆహార, పౌర సరఫరాలు వినియోగదారుల వ్యవహారాలు, పి.నారాయణ - మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్, వంగలపూడి అనిత - హోంశాఖ, విపత్తు నిర్వహణ, సత్యకుమార్ యాదవ్ - వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ,నిమ్మల రామానాయుడు - జలవనరుల అభివృద్ధి శాఖ,ఎన్.ఎమ్.డి.ఫరూక్ - మైనార్టీ, న్యాయశాఖ,ఆనం రామనారాయణరెడ్డి - దేవాదాయశాఖ,పయ్యావుల కేశవ్ - ఆర్థిక, ప్రణాళిక, కమర్షియల్ ట్యాక్సెస్, శాసనసభ వ్యవహారాలు,అనగాని సత్యప్రసాద్ - రెవెన్యూ, రిజిస్ట్రేషన్స్, స్టాంప్స్ శాఖ,కొలుసు పార్థసారథి - గృహ నిర్మాణం, సమాచార శాఖ,డోలా బాలవీరాంజనేయస్వామి - సాంఘిక సంక్షేమం, సచివాలయ, వాలంటీర్ వ్యవస్థ, గొట్టిపాటి రవి కుమార్ - విద్యుత్ శాఖ, కందుల దుర్గేష్ - పర్యాటక, సాంస్కృతిక శాఖ, సినిమాటోగ్రఫీ,గుమ్మడి సంధ్యారాణి - గిరిజన, మహిళా, శిశు సంక్షేమ శాఖ,బీసీ జనార్థన్ రెడ్డి - రోడ్లు, భవనాలు, మౌలిక వసతులు,టీజీ భరత్ - పరిశ్రమలు, వాణిజ్యం,ఎస్.సవిత - బీసీ వెల్ఫేర్, చేనేత సంక్షేమం, జౌళి,వాసంశెట్టి సుభాష్ - కార్మిక శాఖ,కొండపల్లి శ్రీనివాస్ - చిన్న తరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాలు,మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి - రవాణా, యువజన సర్వీసులు, క్రీడలు,

# ఐఎఎస్‌లుల కొరత

- దేశవ్యాప్తంగా 1,365 ఖాళీలు
- యుపిఎస్‌సి నియామకాలపై కేంద్రం ఆంక్షలు
- సంఖ్య పెంచాలని సిఫారసు చేసినా మౌనం
- టచ్ ఉన్న రిటైర్డ్ అధికారులతో ఖాళీల భర్తీ




**టీ మీడియా, జూన్ 14,న్యూఢిల్లీ :**
ఐఎఎస్ అధికారుల నియామకాలను పెంచాలని సిబ్బంది, శిక్షణ మంత్రిత్వశాఖ తన ఆంతరంగిక నివేదికలో అభిప్రాయపడింది. ఐఎఎస్ అధికారుల నియామకాలను ఏడాదికి 180 నుంచి 210-220కి పెంచాలని సిఫారసు చేసింది. 'ఐఎఎస్ అధికారుల సంఖ్యను పెంచాల్సిన అవసరం చాలా కాలం నుండే ఉంటోంది. ప్రతి సంవత్సరం అదనంగా మరో 30-40 మందిని యుపిఎస్‌సి నియమించాలని నివేదిక సిఫారసు చేసింది' అని పేరు చెప్పడానికి ఇష్టపడని ప్రభుత్వ అధికారి ఒకరు 'ది ప్రింట్' పోర్టల్‌కు తెలిపారు. సిబ్బంది-శిక్షణ మంత్రిత్వ శాఖ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ (ఐఐపిఎ) సంయుక్తంగా ఈ నివేదికను రూపొందించాయి.

జిల్లా, రాష్ట్ర, కేంద్ర స్థాయిల్లో ప్రభుత్వ శాఖల్లో భారీగా ఖాళీలు ఉన్నాయని ఆ అధికారి చెప్పారు. 2014 తర్వాత దేశంలో మరో వందకు పైగా జిల్లాలు ఏర్పడ్డాయి. అక్కడ సిబ్బంది కొరత ఉంది. ఈ నేపథ్యంలో ఆ ఖాళీలన్నీ భర్తీ చేసే వరకూ పది సంవత్సరాల పాటు ఏడాదికి 30 మంది కొత్త ఐఎఎస్ అధికారులను నియమించాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని ప్రభుత్వాధికారి వివరించారు. ప్రభుత్వం వద్ద ఉన్న సమాచారం ప్రకారం దేశవ్యాప్తంగా 1,365 ఐఎఎస్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏటా 180 మంది అధికారులను మాత్రమే యుపిఎస్‌సి నియమించాలని ప్రభుత్వం 2012 నుంచి ఆంక్షలు విధించింది.

ప్రతి ఏటా నియమించే ఐఎఎస్ అధికారుల సంఖ్యను పెంచే యోచన ఏదీ లేదని గత ప్రభుత్వంలో సిబ్బంది, శిక్షణ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రిగా పనిచేసిన జితేంద్రసింగ్ 2023లో పార్లమెంటుకు తెలియజేశారు. అధికారుల నియామకాలు పెంచితే నాణ్యతలో రాజీ పడాల్సి వస్తుందని ఆయన తెలిపారు. అయితే ఖాళీల సంఖ్య అధికంగా ఉన్నందున నియామకాలను చేపట్టే విషయంపై ప్రభుత్వం ఆలోచన చేయవచ్చునని ప్రభుత్వాధికారి చెప్పారు. వీటికి అదనంగా డిప్యూటీ సెక్రెటరీ, డైరెక్టర్, జాయింట్ సెక్రెటరీ స్థాయిలో లేటరల్ ఎంట్రీ ద్వారా నియామకాలు జరిపేందుకు రంగం సిద్ధమైందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఇలాంటి 51 పోస్టుల భర్తీ కోసం త్వరలోనే ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

2018-2023 మధ్యకాలంలో అఖిల భారత సర్వీసుల్లో (ఎఐఎస్) ఖాళీల భర్తీకి ప్రయత్నాలు జరిగాయి. ఈ కాలంలో సివిల్ సర్వీసెస్ పరీక్షల ద్వారా జరిపిన నియామకాలు 812 నుంచి 1143కు పెరిగాయి. 2021లో 749 మంది అధికారులను మాత్రమే నియమించారు. ఇక ఐపిఎస్ అధికారుల విషయానికి వస్తే 2019లో 150 మందిని నియమించగా 2020 నుంచి ప్రతి ఏటా 200 మంది అధికారులను నియమించారు. ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌లో కూడా అధికారుల నియామకాలు పెరిగాయి.

## కార్పొరేట్లకు రూ.5 లక్షల కోట్ల రుణాలు

- అప్పులకు పెరిగిన డిమాండ్
- సాఫీగా రిటైల్, ఎంఎస్‌ఎంఇ రుణాలు
- ఎస్‌బిఐ ఛైర్మన్ దినేష్ ఖరా వెల్లడి

**టీ మీడియా, జూన్ 14,న్యూఢిల్లీ :**



కార్పొరేట్ల రుణాల డిమాండ్‌లో భారీ పెరుగుదల ఉందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) ఛైర్మన్ దినేష్ కుమార్ ఖరా అన్నారు. బడా పారిశ్రామికవేత్తలకు సంబంధించి ప్రస్తుతం రూ. 5 లక్షల కోట్ల విలువైన రుణాల జారీ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. కార్పొరేట్‌ల వద్ద పుష్కలంగా నగదు నిల్వలు ఉన్నప్పటికీ.. ఇంతక్రితం మాదిరిగా కాకుండా, వర్కింగ్ క్యాపిటల్ అవసరాలు, సామర్థ్య విస్తరణకు నిధులు సమకూర్చేందుకు రుణాలను కోరుతున్నారని తెలిపారు. టర్మ్ లోన్ శాతాన్ని 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గించామన్నారు. వర్కింగ్ మూలధనం వినియోగంలో పెరుగుదల ఉందని.. ప్రస్తుత రుణ డిమాండ్ స్పష్టం చేస్తుందన్నారు. ఈ మార్పులు గణనీయమైన ప్రయివేటు రంగ అవకాశాలను సూచిస్తాయని ఖరా తెలిపారు. రుణాల విలువను సృష్టించేందుకు ఎస్‌బిఐ మంచి స్థానంలో ఉందన్నారు.ప్రాసెసింగ్ ప్రక్రియలోని కొత్త ప్రతిపాదనలు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. దాదాపు రూ.5 లక్షల కోట్ల విలువ చేసే అప్పుల కోసం తమ వద్ద కార్పొరేట్లు ప్రతిపాదనలు పెట్టారన్నారు. ఈ ఏడాది రిటైల్, వ్యవసాయం, ఎంఎస్‌ఎంఇ రుణాల రంగాలలో 16 శాతం వృద్ధి చోటు చేసుకోవచ్చని అంచనా వేశారు. రిటైల్, అగ్రికల్చర్, ఎంఎస్‌ఎంఇ రుణాలకు సంబంధించి తమకు ఎలాంటి సవాళ్లు లేవని ఖరా తెలిపారు. ఈ రంగాలకు గత ఆర్థిక సంవత్సరం 2023-24లో రూ.21 లక్షల కోట్ల రుణాలు జారీ చేశామన్నారు. అధిక వడ్డీ రేట్లు ఉన్నప్పటికీ ఎస్‌బిఐ రిస్క్ అసెస్‌మెంట్, పూచీకత్తు ప్రక్రియల పటిష్టంగా ఉందన్నారు.వడ్డీ రేట్ల ప్రభావం రుణ పుస్తకం నాణ్యతపై ప్రభావం చూపిస్తాయని భావించడం లేదన్నారు. గృహాలు, వాహన రుణాలపై ఎలాంటి ఒత్తిడి లేదన్నారు. మొత్తం రిటైల్ పోర్ట్‌ఫోలియోలో స్థూల ఎన్‌పిఎలు 0.7 శాతంగా మాత్రమే ఉన్నాయన్నారు. ఇది తమ పూచీకత్తు ప్రమాణాలు, సరైన నాణ్యమైన వ్యాపారాన్ని ఎంచుకునే తమ సామర్థ్యానికి నిదర్శనమన్నారు. తనఖా, కారు రుణాలను పూచీకత్తుతో చెల్లించడంతో తమకు అవకాశాలు పెరుగుతున్నాయని.. ఈ విభాగాల్లో ఎటువంటి సవాళ్లు లేవన్నారు.

## కవితతో సోదరుడు కెటిఆర్ ములాఖత్..

**టీ మీడియా, జూన్ 14,న్యూఢిల్లీ :**



తీహార్ జైలులో ఉన్న ఎమ్మెల్సీ కవితతో ఆమె సోదరుడు, బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ములాఖత్ అయ్యారు. కవిత యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఢిల్లీ మద్యం పాలసీ స్కామ్ కేసులో అరెస్ట్ అయిన కవిత ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్నారు. ఎప్పటికప్పుడు ఆమె కుటుంబం, ఆమె తరుపు న్యాయవాదులు బెయిల్ కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించినా కూడా దర్యాప్తు సంస్థలు కొత్త విషయాలను వెలుగులోకి తీసుకు వస్తున్నారు. దీంతో బెయిల్ వాయిదాపడుతూనే ఉంది.

## వయనాడ్ నుండి ప్రియాంక గాంధీ పోటీ ..!

**టీ మీడియా, జూన్ 14, న్యూఢిల్లీ :**



కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ పోటీ చేసే అవకాశం ఉన్నట్లు సీనియర్ కాంగ్రెస్ నేత శుక్రవారం తెలిపారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ కేరళలోని వయనాడ్, యుపిలోని రారుబరేలీ స్థానాల నుండి విజయం సాధించారు. నిబంధనల ప్రకారం.. ఫలితాలు వెలువడిన అనంతరం 14 రోజులలోపు ఆ అభ్యర్థి మరో స్థానానికి రాజీనామా చేయాల్సి వుంటుంది. దీంతో రాహుల్ గాంధీ వయనాడ్ సీటుని వదులుకోనున్నట్లు ఆ నేత తెలిపారు.ఇటీవల వయనాడ్ పర్యటన సమయంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ఏ నియోజకవర్గాన్ని వదులుకోవాలనే డైలమాలో ఉన్నట్లు ప్రకటించారు. అయితే తన నిర్ణయం మీకు సంతోషాన్ని కలిగిస్తుందని అన్నారు. ఈ నియోజకవర్గం నుండి ప్రియాంక గాంధీ పోటీ చేసే అవకాశం ఉందని సీనియర్ నేత స్పష్టం చేశారు. రెండేళ్ల క్రితమే రాహుల్ గాంధీ రారుబరేలీ నుండి పోటీ చేయాలని నిర్ణయించుకున్నారని, అయితే ఆ విషయాన్ని ఎవరికీ చెప్పలేదని అన్నారు. రెండు సీట్లలో ఒకదానికి రాజీనామా చేసే అంశంపై త్వరలో పార్టీ ప్రకటన విడుదల చేస్తుందని అన్నారు.

## శిల్పా శెట్టి రాజ్ కుంద్ర దంపతులపై చీటింగ్ కేసు

**టీ మీడియా, జూన్ 14,ముంబయి :**



బాలీవుడ్ స్టార్ జంట శిల్పా శెట్టి %-% రాజ్ కుంద్ర పై చీటింగ్ కేసు నమోదుకు ముంబయి కోర్టు ఆదేశించింది. ఇప్పటికే ఈ దంపతులపై బిట్ కాయిన్ ఫ్రాడ్, మనీలాండరింగ్ వంటి కేసులు నమోదయిన సంగతి విదితమే. గత నవంబర్ 2022లో పోర్నోగ్రఫీ కేసులో రాజ్ కుంద్ర జైలు శిక్ష అనుభవించారు. తాజాగా %౨% గోల్డ్ స్కీమ్ (బోగస్ బంగారం పథకం) తో శిల్పా రాజ్ కుంద్ర తమను మోసం చేశారంటూ ఓ వ్యాపారవేత్త కోర్టును ఆశ్రయించారు. వారు స్థాపించిన సత్‌యుగ్ గోల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా తాను మోసపోయాయని, శిల్పా శెట్టి దంపతులపై చర్యలు తీసుకోవాలని సదరు వ్యాపారి కోరారు. శిల్పాశెట్టి-కుంద్రా దంపతులు, వారు స్థాపించిన సత్‌యుగ్ గోల్డ్ ప్రైవేట్ లిమిటెడ్, దాని ఇద్దరు డైరెక్టర్లు, ఒక ఉద్యోగి కలిసి మోసానికి పాల్పడినట్లు ప్రాథమిక సాక్ష్యాధారాలు ఉన్నట్లు జడ్జి ధ్రువీకరించారు. వ్యాపారి చేసిన ఫిర్యాదుపై స్పందించిన ముంబయి అదనపు సెషన్స్ న్యాయమూర్తి ఎన్‌పి మెహతా.. శిల్పా శెట్టి దంపతులపై చీటింగ్ కేసు నమోదు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కేసులో పూర్తి స్థాయిలో విచారణ జరపాలని జడ్జి పేర్కొన్నారు.

## రక్తదానం మరొకరి జీవితానికి వెలుగు

- జనసేన నాయకులు మల్లికార్జున

**టీ మీడియా, జూన్ 14, మహానంది:**




రక్తదానం మరొకరి జీవితానికి వెలుగులు నింపుతుందని, రక్తదానం చేయండి ప్రాణదాతలు కండని జనసేన పార్టీ నాయకులు మల్లికార్జున పిలుపునిచ్చారు. శుక్రవారం మహానంది మండలం ఆర్‌ఎస్ గాజులపల్లి గ్రామంలో ప్రపంచ రక్త దాన దినోత్సవం సందర్భంగా, రక్తదాన శిబిరం జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అత్యవసర సమయాల్లో ప్రాణాలను తిరిగి తెచ్చే రక్తాన్ని దానంగా ఇవ్వడం మహాదానమని,యువత రక్తదానంలో ముందుండాలని, రక్తదానం మరొకరికి ప్రాణ దానమని, అత్యవసర సమయాల్లో ప్రాణాలను కాపాడుతుందన్నారు. ఒక వ్యక్తి పది మంది ప్రాణాలు కాపాడే అద్భుత అవకాశం రక్తదానం వల్ల లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరు రక్తదానం చేసి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని ఆదుకోవాలని అన్నారు. ఈ రక్తదాన శిబిరం తల సేమియా చిన్నారులకు, గర్భిణ మహిళల కోసం ఏర్పాటు చేశారని తెలిపారు.ఈ రక్తదాన శిబిరంలో 30 మంది రక్తదానం చేయగా, వారికి ప్రశంస పత్రాలు అందజేశారు.అనంతరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు ప్రతి సంవత్సరం లాగే, ఈ సంవత్సరం కూడా పుస్తకాలు, స్టేషనరీ ఉచితంగా అందజేశారు. ఈకార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు విజయ్, మారెడ్డి రామయ్య రాయల్, మహేష్, చందు, ప్రసాద్, హరి, కిట్టు, శివ తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ "జిమ్" ప్రారంభించిన ఎమ్మెల్యే

**టీ మీడియా, జూన్14, గోదావరిఖని ప్రతినిధి:**



రామగుండం కార్పొరేషన్ పరిధి జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో ఓపెన్ జిమ్ కేంద్రాన్ని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాగూర్ ఏర్పాటు చేసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈరోజుల్లో ప్రతి ఒక్కరూ వ్యాయమాన్ని అలవర్చుకోవాలన్నారు. ఆరోగ్యం చేకూరుతుందని, ఉరుకుల పరుగుల జీవితంలో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయరాదన్నారు. అనారోగ్యాల బారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నారన్నారు. ముందు చూపుతోనే ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని వ్యాయామం లాంటి కార్యక్రమాలు చేసినట్లయితే ఎలాంటి అనారోగ్యం దరిచేరదని తెలిపారు. ఉదయం పూట వచ్చే మార్నింగ్ వాకర్స్ కి వ్యాయామదారులకి కోడిగుడ్లు, పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ ప్రముఖ నాయకులు, ఆయా విభాగాల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

## బైక్‌ను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

**టీ మీడియా, జూన్ 14,రాజన్న సిరిసిల్ల :**




రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగిలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రుద్రంగి గ్రామ శివారులో ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు(ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇద్దరు యువకుల్లో గండి అజయ్(19) అక్కడికక్కడే మృతి చెందాడు. బోయిని సంతోష్ అనే మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని హాస్పిటల్‌కు తరలించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అజయ్ మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఘోర రోడ్డు ప్రమాదం..ఆరుగురు మృతి

**టీ మీడియా, జూన్ 14,కృత్తివెన్ను:**



కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం సీతనపల్లి వద్ద తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందారు. మరి కొంతమంది గాయబడ్డారు. పాండిచ్చేరి నుండి భీమవరం వైపుకు రొయ్యల మేత లోడుతో వెళ్తున్న కంటైనర్, అమలాపురం అంబేద్కర్ కోనసీమ జిల్లా తాళ్ళరేవు నుండి కృత్తివెన్ను మండలం మునిపెడ వస్తున్న బొలెరో వ్యాన్ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. శీతనపల్లి వద్ద పుల్లల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ ను ఢీకొని ఓవర్ టేక్ చేసే ప్రయత్నంలో కంటైనర్ ను బోలేరో ఢీకొన్నది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే ఐదుగురు మృతి చెందగా, మరో ఆరుగురు గాయపడ్డారు. వారిని మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మరొక వ్యక్తి మృతి చెందారు. వాహనాలపై, రోడ్డుపై మృతదేహాలు రక్తపు మడుగులతో పడి ఉన్నాయి. వాహనాలు రెండూ నుజ్జు నుజ్జు అయ్యాయి. జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో పోలీసులు, స్థానికులు సహాయక చర్యలు చేపట్టారు.

కృత్తివెన్ను మండలం సీతనపల్లి గ్రామం దగ్గర ఈరోజు తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులు/ బాధితులను మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రిలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలు పరామర్శించారు.

### కృత్తివెన్ను ప్రమాద మృతులు వీరే..

కృత్తివెన్ను మండలం సీతనపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అమలాపురం, కాకినాడ జిల్లాలకు చెందిన ఆరుగురు మృతి చెందారు. కాకినాడ జిల్లా గొర్రిపూడి గ్రామానికి చెందిన గండి ధర్మవర ప్రసాద్ (27), అమలాపురంకు చెందిన పేసింగు కనకరాజు (34), కాట్రేనికోనకు చెందిన చింతా లోవరాజు (32), మాగపు సోమరాజు (30), ఎస్ యానాంకు చెందిన రేవు నాగభూషణం (26), తమిళనాడుకు చెందిన కంటైనర్ డ్రైవర్ అయ్యప్పన్ (42) మృతి చెందారు.

## ఆసుపత్రి కార్మికుల జీతాలు తక్షణమే చెల్లించాలి

- అఖిలపక్ష ఐక్యవేదిక డిమాండ్

**టీ మీడియా, జూన్ 14, వనపర్తి బ్యూరో :**




జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రులలో పని చేస్తున్న కార్మికులకు జీతాలు చెల్లించకుండా వేధిస్తున్న అధికారులు కాంట్రాక్టర్ వెంటనే జీతాలు చెల్లించి సదరు కాంట్రాక్టర్ కార్మికులను వేధింపులకు గురి చేస్తున్న బాధ్యులను శిక్షించాలని ఎ.ఐ.టి.యు.సి, అఖిలపక్ష ఐక్యవేదిక డిమాండ్.వనపర్తి జిల్లా కేంద్రంలో మూడు నెలలుగా ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ, సూపర్వైజర్స్ కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడంతో జనరల్ హాస్పిటల్ ముందు శుక్రవారం కార్మికులు ధర్నా చేశారు. కార్మికులకు అఖిలపక్ష ఐక్యవేదిక మద్దతు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా సతీష్ యాదవ్ మాట్లాడుతూ జిల్లా ఆస్పత్రిలో రెండు సంవత్సరాలుగా కార్మికుల పేరిట జీతాలు మాయం కావడం జరుగుతుందని దానిపై ఎంక్వయిరీ చేయాలని పలుమార్లు ఐక్యవేదిక కోరిందని, కానీ విచారణ పేరుతో కార్మికుల వేతనాలు నిలిపివేయడం సమంజసం కాదన్నారు. 148 మంది కార్మికులు పనిచేస్తున్నట్లుగా చూయిస్తూ వారి జీతాలు మాయం చేయడం జరిగిందని, కొందరు వారిని నియమిస్తూ వారి జీవితాలు తీసుకున్నట్లుగా తెలిసిందని, వారి అకౌంట్లో డబ్బులను పరిశీలిస్తే తెలుస్తుందని తెలుపుతూ, ఎంక్వయిరీ పేరుతో మూడు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో స్కూలు ఓపెన్ అయ్యే టైములో డబ్బులు లేక అల్లాడుతున్న కార్మికులు ఈరోజు ధర్నా చేయడం జరిగింది వారికి మద్దతుగా ఏ.ఐ.సీ.యూ.సీ రాష్ట్ర నాయకులు సురేష్ జిల్లా నాయకులు, గోపాలకృష్ణ, ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు సతీష్ యాదవ్, ఎస్సీ, ఎస్టి మానిటరింగ్ కమిటీ సభ్యులు గంధం నాగరాజు తదితరులు మద్దతు తెలుపుతూ వెంటనే వారి వేతనాలు చెల్లించి ఆసుపత్రిలో జరుగుతున్న అక్రమాలను విచారణ చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా మాతా శిశు సంరక్షణ అంబులెన్స్ ను ఆస్పత్రిలోని పాత , కొత్త ఇనుప మంచాలు, తదితరు సామాన్లు టెండర్ లేకుండా అమ్ముకున్నారని వాటిపై విచారణ చేసి దోషులను శిక్షించాలని, ఐక్యవేదిక డిమాండ్ చేస్తుంది. వెంటనే జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే , రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు దీనిపై చర్యలు తీసుకోవాలని బాధ్యులను శిక్షించాలని లేనియెడల ఆందోళన పెద్ద ఎత్తున చేస్తామని తెలిపారు.

## గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పలుస శంకర్ గౌడ్

**టీ మీడియా, జూన్ 14, వనపర్తి బ్యూరో :**



వనపర్తి జిల్లా, శ్రీరంగాపూర్ మండలం, తాటిపాముల గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు పలుస శంకర్ గౌడ్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు గా పదోన్నతి పొందారు. 1989 సం.లో విధుల్లో చేరిన శంకర్ గౌడ్, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని పలు పాఠశాలలో ఉపాధ్యాయుడుగా, ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం వనపర్తి జిల్లా మనిగిల్ల జడ్పీ హెచ్‌ఎస్ లో ప్రధానోపాధ్యాయుడుగా విధులు నిర్వహించారు. పి.శంకర్ గౌడ్ మణిగిల్ల పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నపుడు గత సం..పాఠశాలలో 42 రోజుల అక్షర దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులలో అద్భుతమైన మార్పు తీసుకొచ్చారు. దీంతో పాటు పలు కార్యక్రమాలు విలువల ప్రదర్శన నిర్వహించి దేశభక్తి, విద్యార్థులకు అవగాహన కల్పించారు. మణిగిల్ల పాఠశాలకు రాష్ట్ర స్థాయి గుర్తుంపు తీసుకొచ్చారు. యాపర్ల జిహెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరించడం పట్ల గ్రామస్తులు, ఉపాధ్యాయులు, బంధువులు, సాహితి కళావేదిక ప్రతినిధులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీ లోకనాథ్ రెడ్డి, అఖిల పక్ష నాయకులు సతీష్ యాదవ్. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల అధ్యక్షులు మద్దిలేట్టి, కార్యదర్శి గణేష్ కుమార్, చంద్రశేఖర్, కవి జనజ్వాల,. బైరోజు చంద్రశేఖర్, జర్నలిస్టు యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాయకులు మధుగౌడ్, ఉమ్మళ్ల రాములు టీపిఆర్టీయు జిల్లా అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, ..,బోచ్చిబాబు నాగరాజు ,బండారు శ్రీనివాస్, బైరోజు శ్యాంసుందర్, మణిగిల్ల టీచర్స్ వారి నివాసంలో ఘనంగా సన్మానించారు.

## విద్యార్థి దశతోనే భావి జీవితానికి మార్గం వేసుకోవాలి

**-ఘనంగా ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ కలశాల దినోత్సవం..**

**టీ మీడియా, జూన్ 14, మహానంది:**




విద్యార్థి దశతోనే భావి జీవితానికి సరైన మార్గం వేసుకోవాలని నంద్యాల ఆర్ ఏ ఆర్ ఎస్ ఏ డి ఆర్ డాక్టర్ సరళమ్మ పేర్కొన్నారు మహానంది ఫారంలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవస్థాయ కళాశాలలో కళాశాల దినోత్సవం అసోసియేట్ డీన్ డాక్టర్ జయలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థికి పుస్తకాలు ఎంత ముఖ్యమో, అంతకంటే పది రెట్లు మనిషి జీవితానుభవం ద్వారా నేర్చుకోగలుగుతారన్నారు. విద్యా పుస్తకాల వరకే పరిమితం కాకుండా, నిత్యజీవితంలో సంబంధం కలిగి ఉండాలని, అది జీవితాంతం విద్య కావాలని తెలిపారు. సరిగ్గా ఆలోచిస్తే ఈ ప్రపంచంలో, అస్సలు సాధ్యం కానీ విషయం అంటూ ఏదీ లేదన్నారు. అయితే మనకు కావాల్సిందల్లా పాజిటివ్గా ఆలోచించి, ముందడుగు వేయాలన్నారు. అనంతరం కళాశాల మ్యాగజైన్ ఆవిష్కరించి, నివేదికలు చదివారు. ఈ కార్యక్రమంలో ఓ ఏ ఎం డాక్టర్ ఫరీదా, ఓ ఎస్ ఏ డాక్టర్ ఎల్ .విజయభాస్కర్, డాక్టర్ సరోజినీ దేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పంతులమ్మ ప్రేమ పాఠాలు

- విద్యార్థి బలవన్మరణం

**టీ మీడియా, జూన్ 14,నాగర్ కర్నూల్ :**



జిల్లా లింగాల మండలం నల్లమల్ల రాంపూర్‌పెంటకు చెందిన చిగుర్ల రాముడు (19) అనే చెంచు విద్యార్థి బలవన్మరణానికి పాల్పడిన విషాద ఘటన వెలుగులోకి వచ్చింది. తెల్లావారితే పాఠశాలకు రావాలి. కానీ, అంతలోనే అతడు అడవిలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సంచలనంగా మారింది. అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి పట్ల కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర అందోళ వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. చిగుర్ల రాముడు అనే విద్యార్థి అచ్చంపేట మండలంలో ఓ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో అదే పాఠశాలలో పని చేస్తున్న ఓ ఉపాధ్యాయురాలు విద్యా బుద్ధులు పాఠాలు చెప్పాల్సింది పోయి, అతడితో సన్నిహితంగా ఉంటూ ప్రేమ పాఠాలు చెప్పింది. ఆ విద్యార్థిని వశపరుచుకుని, సన్నిహితంగా ఉండసాగింది. అయితే, ఆ టీచర్ కు భర్త ఉన్నప్పటికీ విద్యార్థితో కలిసి ఎక్కడికైనా వెళ్లిపోదామని అనుకుంది. ఈ క్రమంలో వారిద్దరూ కల్వకుర్తి పట్టణానికి చేరుకున్నారనే సమాచారం టీచర్ భర్తకు తెలిసింది. దీంతో టీచరమ్మ రాముడిని అక్కడి నుంచి వెళ్లిపోవాలని వారించింది. అనంతరం సరిగ్గా మూడు క్రితం రాముడు అడవిలోకి వెళ్లి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

## మానవత్వం చాటున మడిపెల్లి మల్లేష్

**టీ మీడియా,జూన్ 14, గోదావరిఖని:**



రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 21వ డివిజన్ ముబారక్ నగర్ కు చెందిన చాంద్ బి అనే 70 సంవత్సరాల వృద్ధురాలు చిన్న పూరి గుడిసె మీద ప్లాస్టిక్ కవర్లు కప్పుకొని నివసిస్తున్న విషయాన్ని గోదావరిఖనికి చెందిన ఉప్పల్ల శ్రీధర్ ద్వారా చంద్ బీ అమ్మ యొక్క పరిస్థితిని తెలుసుకున్న సేవా స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షులు మడిపెల్లి మల్లేష్ వెంటనే చంద్ బీ ఉంటున్నా ముబారక్ నగర్ వెళ్లి చాంద్ బీ అమ్మ గుడిసె పరిస్థితిని చూసి మడిపెల్లి మల్లేష్ 10 రోజుల్లో నూతన ఇల్లు నిర్మాణం చేసి ఇస్తానని అమ్మ కు మాట ఇచ్చి అనుకుంట్లుగా చంద్ బి అమ్మ కు మల్లేష్,శ్రీ సీత రామ సేవా సమితి సబ్యుల అందరి సహకారంతో నూతన ఇల్లు నిర్మాణం పూర్తి చేసి స్థానిక ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ చేతుల మీదగా శుక్రవారం రోజున గృహప్రవేశం చేయించి చంద్ బీ అమ్మకు నూతన ఇళ్లను అప్పగించారు అనంతరం మడిపెల్లి మల్లేష్ మాట్లాడుతూ... కరోనా కష్టకాలం నుండి నేటి వరకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తు పేద ప్రజలకు తోడుగా ఉంటున్నానాని గతంలో కూడా పీకే రామయ్యా కాలనీలో కొడుకు కోడలు చనిపోయి ఎవరు లేక ఉండటానికి కూడా ఇల్లు లేక 13 సంవత్సరాల మనువరాలు తో చిన్న పందిరి కింద తలదాచుకుంటున్నా చంద్రమ్మ అనే అమ్మ కూడా నాఆత్మీయుల సహకారంతో శ్రీ సీతా రామ సేవా సమితి సభ్యుల సహకారంతో నూతన ఇల్లు నిర్మాణం చేసి ఇవ్వడం జరిగిందని చంద్ బీ అమ్మ ఇల్లు తో రెండోవ ఇల్లు నిర్మాణం చేశామని మల్లేష్ తెలిపారు.నేను చేస్తున్న ప్రతి కార్యక్రమానికి నా వెన్నంటే ఉంటు నాకు సహాయ సహకారాలు అందిస్తున్న నా ఆత్మీయుల అందరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు మల్లేష్ తెలిపారు ఈ కార్యక్రమంలో 21 డివిజన్ కార్పొరేటర్ సలీమ్ బేగ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు అసిఫ్ పాషా, మహమ్మద్,సోషల్ మీడియా నాయకులు ముళ్ళపూడి ప్రతాప్ రాజ్.దులికట్ట సతీష్,ఉప్పల్ల శ్రీధర్,కాంగ్రెస్ పార్టీ రెండోవ డివిజన్ ఏస్సీ సెల్ అధ్యక్షులు పుల్లూరి నాగభూషణం, కుమారస్వామి,పెనుగొండ తిరుపతి,చిప్ప మల్లేష్, శ్రీ సీతారామ సేవాసమితి అధ్యక్షురాలు గోలివాడ చంద్రకళ,కంది సుజాత, బిల్లా శ్రీదేవి,కే.రమాదేవి, మండల రమాదేవి,జీ సరిత,లక్ష్మీ,బి.లత,పి. చంద్రకళ,కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పదోన్నతి పొందిన జిహెచ్‌ఎంలకు సన్మానం

**టీ మీడియా, జూన్ 14, వనపర్తి బ్యూరో :**




స్కూల్ అసిస్టెంట్ నుంచి జిహెచ్‌ఎంలుగా పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను టిఎస్ యుటిఎఫ్ జిల్లా కమిటీ ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిహెచ్‌ఎం గా పదోన్నతి పొందిన బి.నరేందర్, బి. శ్రీనివాసులు, టి. హనుమంతు, శాంతన్న,పి. శంకర్ గౌడ్ లను శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. టిఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్ రవి ప్రసాద్ నాణ్యమైన విద్య అందించడంలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు హమీద్ ,కే జ్యోతి,అరుణ, బి. వెంకటేష్ పి. శ్రీనివాస్ గౌడ్, ఎన్ చంద్రయ్య, లక్ష్మణ్ నాయక్ , జి.మురళి జి. కృష్ణయ్య, భగవంతు, ఎం.వెంకటేష్, ఎం. కృష్ణయ్య, శ్రీ రామ్, సూరయ్య ాల్గొన్నారు.

## అధైర్య పడొద్దు.. ప్రభుత్వం అండగా ఉంటుంది.

**- బాధిత కుటుంబానికి చేయూత**



**టీ మీడియా, జూన్ 14,మల్హర్ రావు:**అధైర్య పడొద్దు.. ప్రభుత్వం అండగా ఉంటుందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బడితేల రాజయ్య అన్నారు. మండలంలోని రుద్రారం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో చంద్రగిరి ఎంకమ్మ కుటుంబాన్ని గురువారం కాంగ్రెస్ పార్టీ మండల మహిళ అధ్యక్షురాలు కొండ రాజమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఐత రాజిరెడ్డితో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఓదార్చారు. అధైర్య పడొద్దు ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని, రూ.5 వేలు ఆర్థిక సాయం చేసి చేయితనిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వేల్పుల రవి, గ్రామ ఇంచార్జి అధ్యక్షుడు చంద్రగిరి సంపత్,కాంగ్రెస్ నాయకులు వేముల చంద్రమోహన్, అల్లాడి సురేష్,దుద్దిళ్ల సత్యం,చంద్రగిరి అశోక్ పాల్గొన్నారు.

# అమ్మాయిలను ప్రోత్సహించిన సినిమాటోగ్రఫీ నైపుణ్యాలు

- దేశంలోనే ప్రధమంగా నిలిచిన కార్యక్రమం
- అనుభవాలను పంచుకున్న విద్యార్థులు
- త్వరలో 90 కోట్లుతో సాంస్కృతిక కేంద్రం
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి




**టీ మీడియా, జూన్ 14,నల్గొండ :**లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ కళాశాల, చర్లపల్లిలోని ఎస్సీ, ఎస్టీ విభాగానికి చెందిన 100 మంది అమ్మాయిలకు సినిమాటోగ్రఫీ నైపుణ్య శిక్షణ కోర్సులు నిర్వహించిన నిలగిరి నిపుణా ప్రోగ్రాం సర్టిఫికెట్ పంపిణీ శుక్రవారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాల ఆవరణలో ఉన్న ఉదయాదిత్య భవన్లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనే మొట్టమొదటిదిగా, 100 మంది అమ్మాయిలను సినిమాటోగ్రఫీ సంబంధిత నైపుణ్యాలను నేర్చుకోవడానికి ప్రోత్సహించింది. ఈ సంవత్సరం ఫిబ్రవరి నెలలో ప్రారంభమై ఏప్రిల్ 2024 వరకు సాగిన 45 రోజుల కోర్సు థియరీ, ప్రాక్టికల్ శిక్షణ రెండు అందించడం జరిగింది. సర్టిఫికెట్ పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర సినిమాటోగ్రఫీ, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి, జిల్లా ఎస్పీ దీప్తి చందన, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస రెడ్డి, స్పేస్ అకాడమీ చైర్మన్ శశి ప్రీతం, నటుడు వైభవ్ సూర్య, ఇతర ప్రముఖులు, సాంఘికసంక్షేమ, గిరిజన సంక్షేమ విభాగాల అధికారులు, డిఆర్డిఏ పిడి నాగిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాళ్లు, మేనేజ్మెంట్, విద్యార్థులు, మహిళా సమాఖ్య గ్రూపులు, గ్రామీణ అభివృద్ధి నైపుణ్య శిక్షణ కేంద్రం విద్యార్థులు 100 మంది అమ్మాయిల తల్లిదండ్రులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని డబ్బింగ్, యాంకరింగ్ విద్యార్థులు జయశ్రీ, శ్రుతి చక్కగా నిర్వహించగా, సినిమాటోగ్రఫీ విద్యార్థులు శ్రుతి, ఆమె బృందం కెమెరా కవరేజీ నిర్వహించారు. రుద్రవరం పల్లవి, ప్రణతి, ఇతర విద్యార్థులు అతిథుల ముందు తమ అనుభవాలను గురించి మాట్లాడారు. సమావేశంలో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లా అభివృద్ధి, యువత అమ్మాయిల విద్యకు తన ఆసక్తిని తెలియజేశారు. ఇటీవల ఐటి మంత్రి శ్రీధర్ తో కలిసి అమెరికా పర్యటనలో, అభివృద్ధి చెందిన దేశాలు నైపుణ్య అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తాయని, ఇది జీవితంలో విజయం, స్థిరపడే గమ్యంగా ఉన్నదని ఆయన అన్నారు. సినిమాటోగ్రఫీ వంటి నైపుణ్యాలను నేర్చుకోవడానికి మరింత మందివిద్యార్థులను ప్రోత్సహించడానికి తన పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. జిల్లా అభివృద్ధి ప్రాజెక్టుల గురించి మాట్లాడుతూ నల్గొండ చుట్టూ ప్రత్యేకంగా 15 కిమీ రింగ్ రోడ్, క్లాక్ టవర్ సర్కిల్ వద్ద రూ. 90 కోట్లు ఖర్చుతో సాంస్కృతిక కేంద్రం వంటి ప్రాజెక్టులు త్వరలో రాబోతున్నాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ హరి చందన మాట్లాడుతూ , మంత్రి కోమటి రెడ్డి వెంకట రెడ్డి జిల్లా నైపుణ్య అభివృద్ధి కోర్సులకు ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ఆయన సినిమాటోగ్రఫీ పోర్ట్ఫోలియోను నిర్వహిస్తున్నందున, ఈ నైపుణ్యాలను ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ అమ్మాయిలకు నేర్పడానికి ఈ కార్యక్రమం వెంటనే చేపట్టబడిందని ఆమె తెలిపారు. స్పేస్ అకాడమీ చైర్మన్ శశి ప్రీతం మాట్లాడుతూ, మంత్రి, కలెక్టర్ నిర్ణయించిన లక్ష్యాలను సాధించడానికి విద్యార్థులను మార్గనిర్దేశనం చేయడం, నైపుణ్యాలలో నిపుణులుగా తీర్చడం అనేది బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. అలాగే, శిక్షణా కాలంలో విద్యార్థులను ఇంటర్న్షిప్లు, అడ్వాన్స్డ్ లెర్నింగ్, కెరీర్ కౌన్సెలింగ్లతో సహకరించడానికి సపోర్ట్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఆవనపు కలెక్టర్ టి. పూర్ణచంద్ర, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, డిఆర్ఓ రాజ్య లక్ష్మీ, డిఆర్డిఏ పిడి నాగిరెడ్డి, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ కోటేశ్వరరావు, నల్గొండ జడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య, ఆర్టీవో రవి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధితురాలికి ఎంపీపీ పరామర్శ

**టీ మీడియా, జూన్ 14, మహానంది:**



మహానంది మండలం గాజులపల్లె గ్రామంలో ఎస్సీ కాలనీ యందు పాల. ఆదిలక్ష్మమ్మకు చెందిన పూరి గుడిసె ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి దగ్ధమై లక్ష రూపాయలు పైన నష్టం వాటిల్లింది. శుక్రవారం నష్టపోయిన బాధితురాలు ఆదిలక్ష్మమ్మ ను ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని పరామర్శించారు. అగ్ని ప్రమాదానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. కాలిపోయిన ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా తన వంతు సాయంగా ఐదువేల రూపాయలు బాధితురాలుకు అందజేశారు. అగ్ని ప్రమాదం వల్ల నష్టపోయిన బాధితురాలుకు ప్రభుత్వం అండగా ఉంటుందని, పక్క గృహం నిర్మించి ఇస్తామని భరోసా ఇచ్చారు. ఆమె వెంట, తాహసిల్దార్ రామచంద్రుడు, డిప్యూటీ తాహసిల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఈవో ఆర్ డి శివ నాగజ్యోతి, విఆర్ఓ వెంకటరాముడు, పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ ఇర్ఫాన్, సచివాలయ సిబ్బంది, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## తొలి ఐదు సంతకాలు చరితాత్మకం

- ప్రజారంజకం బాబు పాలన..

**టీ మీడియా, జూన్ 14, మహానంది:**

తొలి ఐదు సంతకాలు చరితాత్మకం అని,ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాణ స్వీకారం అనంతరం ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చారని మహానంది మండల అధ్యక్షురాలు బుడ్డారెడ్డి యశస్విని శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. ముందుగా మహానందిలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలేసి టిడిపి నాయకులు, కార్యకర్తలు నివాళులు అర్పించారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయం వద్ద సమావేశమైవారు మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీల్లో, ఐదు హామీలైన డీఎస్సీ ఉద్యోగాలు, లాండ్ టైటిల్ యాక్ట్ రద్దు, అన్న క్యాంటీన్లు పునరుద్ధన, రూ.4000 పెన్షన్లు,స్కిల్ సెన్సెస్ పై సంతకాలు చేయడం పై హర్షం వ్యక్తం చేస్తూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు మధు, టిడిపి నాయకులు నరాల చంద్రమౌళీశ్వర రెడ్డి,కంచర్ల శివ, కాకర్ల శివ, టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## జైలు నుంచి సినీనటి హేమ విడుదల

**టీ మీడియా, జూన్ 14, బెంగళూరు :**



బెంగళూరు రేవ్ పార్టీ కేసుకు సంబంధించి అరెస్టయిన తెలుగు సినీనటి హేమ జైలు నుంచి విడుదలయ్యారు. ఇటీవల ఆమెకు స్థానిక కోర్టు షరతులతో కూడిన బెయిల్ ను మంజూరు చేసింది. ఆమె నుంచి డ్రగ్స్ను జప్తు చేసుకోలేదని, ఘటన జరిగిన పది రోజులకు వైద్య పరీక్షలు నిర్వహించారని హేమ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. డ్రగ్స్ తీసుకున్నట్లు పోలీసులు సాక్ష్యాలు అందించలేదని న్యాయస్థానం దృష్టికి తీసుకువెళ్లారు. ఆమె పార్టీలో పాల్గొన్నట్లు చూపే ఆధారాలను బెంగళూరు నేర నియంత్రణ దళం (సీసీబీ) న్యాయవాది కోర్టుకు అందజేశారు. వాదనలను విన్న న్యాయమూర్తి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. ఈ క్రమంలో శుక్రవారం హేమ జైలు నుంచి బయటకు వచ్చారు. ఈ సందర్భంగా సెక్యూరిటీ పోస్ట్ వద్ద ఉన్న సిబ్బంది ఆమెను కన్నడలో ప్రశ్నించగా, 'బర్త్డే పార్టీ' అంటూ సమాధానం ఇచ్చారు. మీడియాతో మాట్లాడకుండా వెళితే వేరేరకంగా ఉంటుందంటూ హేమ పక్కన ఉన్న వ్యక్తి ఆమెకు సూచించారు. అయితే, 'వీళ్లకు చెప్పాల్సిన అవసరం ఏముంది' అనుకుంటూ హేమ అక్కడినుంచి వెళ్లిపోవడం గమనార్హం.

## మీర్పేట్ కార్పొరేటర్ అరెస్ట్

**టీ మీడియా, జూన్ 14,తిరుపతి :**



నకిలీ డాక్యుమెంట్స్ సృష్టించిన కేసుకు సంబంధించి మీర్పేట్ కార్పొరేటర్ను పోలీసులు అరెస్ట్ చేశారు. కరుణాకర్ అనే వ్యక్తి ల్యాండ్ను కార్పొరేటర్ కబ్జా చేసి నకిలీ ల్యాండ్ డాక్యుమెంట్స్తో వేరే వాళ్లకి అమ్మే ప్రయత్నం చేశాడు. సరిగ్గా రిజిస్ట్రేషన్ టైంకి రిజిస్ట్రేషన్ ఆఫీసులో ఈ ల్యాండ్ వివరాలు బయటికి తీయడంతో నకిలీ డాక్యుమెంట్ విషయం వెలుగుచూసింది. దీనిపై ల్యాండ్ కరుణాకర్ ఫిర్యాదు ఇవ్వడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ నందకుమార్ తిరుపతి పారిపోగా అక్కడికి వెళ్లి పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఆర్టీసీ బస్సు కింద పడి విద్యార్థిని మృతి

**టీ మీడియా, జూన్ 14,హైదరాబాద్ :**



హైదరాబాద్ మధురా నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. ఆర్టీసీ బస్సులో నుంచి ఓ విద్యార్థిని కాలుజారి పడింది. దీంతో ఆమె బస్సు చక్రాల కింద పడి ప్రాణాలు విడిచింది. ఆర్టీసీ బస్సు డ్రైవర్ అప్రమత్తమై బస్సును నిలిపివేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతురాలిని యూసుఫ్గూడలో ఉన్న మాస్టర్స్ కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న మెహరీన్గా పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ రోడ్డు ప్రమాద ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

## ఎన్నికల ఫలితాల సమీక్షా సమావేశం

**టీ మీడియా, జూన్ 14, వనపర్తి బ్యూరో :**



నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ ఎన్నికల ఫలితాల సమీక్షా సమావేశం జిల్లా పార్టీ కార్యాలయంలో అధ్యక్షులు గట్టు యాదవ్ అధ్యక్షతన జరిగింది. ఇట్టి సమావేశములో నిరంజన్ రెడ్డి, రావుల.చంద్రశేఖర్ రెడ్డి, ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్, ఎం.ఎల్.సి నవీన్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. చంద్రబాబు తెలంగాణపై హక్కులపై విషం నూరిపోస్తాడు. హైదారాబాద్ కేంద్రపాలిత ప్రాంతంగా చేసే కుట్ర జరుగుతుంది. 60లక్షల సైన్యం ఉన్న బి.ఆర్.ఎస్ పార్టీని ఎవ్వరూ ఏమీ చేయలేరు. సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి మాజీ మంత్రి మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా ఉంటాం అని అన్నారు. తెలంగాణ ఆత్మతో ముడిపడిన సంబంధం బి.ఆర్.ఎస్ పార్టీది అని దాని ఎవ్వరూ విడదీయలేరని అన్నారు. తెలంగాణపై అదృశ్యశక్తులు(చంద్రబాబు)ప్రభావం ఉంటుంది అని అందుకే నీటిపారుదల కార్యదర్శిగా తెలంగాణ వ్యతిరేక శక్తి అదిత్యాదాస్ ని రేవంత్ రెడ్డి నియమించారని తెలంగాణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్,బి.జే.పి వైఫల్యాలు ఎప్పటికపుడు వెలుగులోకి తెస్తూ ప్రజల మద్దతు కూడగట్టాలని అన్నారు. ఫలితాలతో నిరాశ చెందకుండా రెట్టించిన ఉత్సాహంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికలో ఓటమి రాజకీయ పార్టీల మనుగడకు ముందడుగు.. రావుల మాట్లాడుతూ అభివృద్ధిపై కె.సి.ఆర్, నిరంజన్ రెడ్డి శ్రద్ధ పెట్టడం వల్ల పార్టీ కొంత ఇబ్బంది పడ్డ మాట వాస్తవం. నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసిన నిరంజన్ రెడ్డి మరోసారి ఎం.ఎల్. ఎ కావలసిన అవసరం ఉంది అని అన్నారు. బి.ఆర్.ఎస్ పార్టీనీ సంస్థాగతంగా బలోపేతం చేస్తామని అన్నారు. అమరవీరుల త్యాగం కంటే అక్షింతలు ముఖ్యమైనాయి. ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఓటమి గెలుపులతో సంబంధం లేకుండా రాజకీయ పార్టీలు బలపడి ప్రజల మన్ననలు పొంది ఓటింగ్ శాతం పెంచుకోవాలని అన్నారు..పోరాట స్ఫూర్తికి, ఆత్మస్థైర్యాన్నికి నిదర్శనం ఎం.ఎల్.సి గెలుపు. ఎం.ఎల్. ఎ మేఘ రెడ్డి బి.ఆర్.ఎస్ పార్టీని దూషించడం మానుకోవాలి. నవీన్ రెడ్డి ఎం.ఎల్.సి మాట్లాడరు. సమావేశానికి అన్ని మండలాల అధ్యక్షులు,ప్రజాప్రతినిధులు తరలివచ్చి వారి అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రాష్ట్ర నాయకులు రాజవరప్రసాద్,ఇబ్రహీం,నాగం.తిరుపతి రెడ్డి,అభిలాష్ రావు,జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, వాకిటి.శ్రీధర్ బి.లక్ష్మయ్య,పి.రమేష్ గౌడ్,ఎం.పి.పిలు కృష్ణా నాయక్,సేనాపతి, మున్సిపల్ చైర్మన్ ఎద్దుల.కరుణశ్రీ, రఘునాథ్ రెడ్డి,భీమన్న, సమ్య నాయక్,మాజీ మార్కెట్ చైర్మన్ లక్ష్మమా రెడ్డి,పార్టీ అధ్యక్షులు వనం.రాములు,వేణు,రాళ్ళ.కృష్ణయ్య, మాణిక్యం,తిరుపతయ్య,మార్క్ ఫెడ్ డైరెక్టర్ విజయ్ కుమార్,జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల.అశోక్,కౌన్సిలర్స్ నాగన్న యాదవ్,కంచె.రవి, ఉంగ్లమ్.అలేఖ్య తిరుమల్,గంధం.పరంజ్యోతి,సింగిల్ విండో ప్రెసిడెంట్ రఘువర్ధన్ రెడ్డి, మాధవ్ రెడ్డి, నరేష్,మహేశ్వర్ రెడ్డి,సూర్యవంసం. గిరి,కార్తీక్,సునీల్ వాల్మీకి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో కొనసాగుతున్న ఆవర్తన ద్రోణి

### -పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు



**టీ మీడియా, జూన్ 14, హైదరాబాద్ :** తెలంగాణ నుంచి మధ్య బంగాళాఖాతంలోని పాంతాల వరకు కొనసాగిన ద్రోణి శుక్రవారం రాయలసీమ నుంచి పశ్చిమ మధ్య బంగాళాఖాతం మీదుగా మధ్య బంగాళాఖాతం వరకు సగటు సముద్ర మట్టం నుంచి 3.1 కి.మీ నుంచి 5.8 కి.మీ మధ్యలో కొనసాగుతుంది. గాలులు పశ్చిమ దిశ నుంచి తెలంగాణ రాష్ట్రం వైపుకు వీస్తున్నాయి. దీని ప్రభావంతో రాబోయే మూడు రోజులు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కొన్ని చోట్ల కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. శని, ఆదివారాల్లో రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. శుక్రవారం మెదక్ జిల్లాలో వడగాళ్ల వాన కురిసినట్లు అధికారులు తెలిపారు. వికారాబాద్ జిల్లాలో కొన్ని చోట్ల భారీ వర్షం కురిసినట్లు తెలిపారు. శనివారం రాష్ట్రంలోని నిజామాబాద్, నల్లగొండ, సూర్యాపేట, మెదక్, కామారెడ్డి, మహబూబ్నగర్, నాగర్కర్నూల్, వనపర్తి, నారాయణపేట,జోగులాంబ గద్వాల జిల్లాలలో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. అదే విధంగా ఆదివారం నిజామబాద్, రాజన్న సిరిసిల్ల,కరీంనగర్,పెద్దపల్లి, ములుగు, భద్రాద్రికొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్నగర్, నాగర్కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది. దీంతో ఆయా జిల్లాలకు రెండు రోజులు వాతావరణ శాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

## పోలీసుల ఎదుట మావోయిస్టు దంపతుల లొంగుబాటు



**టీ మీడియా, జూన్ 14,వరంగల్ :** వరంగల్ పోలీసుల ఎదుట మావోయిస్టు దంపతులు లొంగిపోయారు. ఈ మేరకు వరంగల్ ప్రస్తుతం ఇంచార్జి పోలీసు కమిషనర్ అభిషేక్ మహంతి వివరాలను వెల్లడించారు. లొంగిపోయిన ఇద్దరు మావోయిస్టులను సుష్మిత, దూలగా పోలీసులు గుర్తించారు. సుష్మిత సెంట్రల్ కమిటీ స్టాఫ్గా, దూల ప్రొటెక్షన్ టీం మెంబర్గా పని చేశారు. హనుమకొండ జిల్లా హసన్పర్తి మండలం సుదంపల్లి గ్రామానికి చెందిన తిక్క సుశ్మిత(27) ఇంటర్ వరకు చదువుకుంది. తన తండ్రి తిక్క సుధాకర్ మావోయిస్టు సానుభూతిపరుడిగా పని చేశారు. దీంతో ఆమె మావోయిస్టు పార్టీకి ఆకర్షితురాలై 2016లో ఛత్తీస్గఢ్లోని బీజాపూర్ జిల్లా కోమటిపల్లి గ్రామ అటవీప్రాంతంలో బడే చొక్కారావు అలియాస్ దామోదర్ సమక్షంలో మావోయిస్టు పార్టీలో చేరింది. ఛత్తీస్గఢ్ సుకుమా జిల్లా పరియా గ్రామానికి చెందిన మడకం దూల అలియాస్ దూల ఐదో తరగతి వరకు చదువుకున్నాడు. తన అన్నయ్య ఐయేత 2008 సీపీఐ మావోయిస్టు పార్టీలో చేరాడు. దూల కూడా 2015లో ఏరియా కమిటీ మెంబర్ అయిన జోగి ప్రోత్సాహంతో మావోయిస్టు పార్టీలో చేరాడు. మావోయిస్టు పార్టీలో పనిచేస్తున్న సమయంలో సుష్మిత, దూల మధ్య పరిచయం ఏర్పడింది. 2020 మార్చి 30వ తేదీన వివాహం చేసుకున్నారు. తరువాత వివిధ హెూదాల్లో పలు చోట్ల పని చేశారు. మావోయిస్టు సిద్ధాంతాలపై నమ్మకం కోల్పోయి, తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన పునరావాస పథకం గురించి తెలుసుకుని వీరిద్దరూ శుక్రవారం వరంగల్ పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరిరువురికి ఒక్కొక్కరికి నాలుగు లక్షల రూపాయలు నగదు రివార్డ్ వున్నదని ఆ మొత్తాన్ని బ్యాంకు డీడీ రూపంలో వారికి అందజేసినట్లు పోలీసులు తెలిపారు.

## అక్షర. అభ్యాసం కార్యక్రమాన్ని ప్రారంభించిన జిఎంఆర్



**టీ మీడియా, జూన్ 14,పటాన్చెరు:** మండల పరిధిలోని చిట్కుల్ గ్రామంలో గల ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన సామూహిక అక్షర అభ్యాసం కార్యక్రమాన్ని ప్రారంభించిన పటాన్చెరు శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి . హాజరైన జెడ్పిటిసి సుప్రజా వెంకట్ రెడ్డి, ఎంపీటీసీలు మంజుల శ్రీశైలం, మాధవి నరేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, మండల విద్యాశాఖ అధికారి రాథోడ్, మాజీ సర్పంచ్ చిన్న రాములు, మాజీ ఉపసర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, పాఠశాల సిబ్బంది, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాలలో దరఖాస్తు ఆహ్వానం..

- ప్రిన్సిపల్ సుహాసిని

**టీ మీడియా, జూన్ 14,సుల్తాన్ బజార్ (హైదరాబాద్):**



గన్ ఫౌండ్రి లోని మహబూబియా ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ సువాసిని తెలిపారు. గురువారం కళాశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ.. గత ఇంటర్మీడియట్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థినిలు రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయిలో మంచి ఫలితాలతోరాణించారని తెలిపారు. 61 శాతం రిజల్ట్ సాధించామన్నారు. తమ కళాశాల హెచ్ ఈ సీ విద్యార్థిని కేజీయ స్టేట్ ర్యాంకర్ గా రాణించాలన్నారు. బైపీసీలో వర్షిని, ఎంపీసీలో గీత లు కళాశాల టాపర్ నిలిచారని తెలిపారు. తమ కళాశాలలో ఎంపీసీ బైపీసీ ఎంఈసి హెచ్ఈసి కోర్సులు ఉన్నాయన్నారు. కళాశాల విద్యార్థినిలకు ఉచితంగా టెక్స్ట్ పుస్తకాలను అందిస్తామన్నారు. స్కాలర్షిప్, బస్సు పాస్ సౌకర్యం కల్పిస్తామన్నారు. తమ కళాశాల ఉత్తమ ఫలితాలు సాధిస్తుందని, తమ లెక్చరర్లు నాణ్యమైన విద్య బోధన అందిస్తారని చెప్పారు. ప్రైవేటు దీటుగా ప్రభుత్వ విద్యను అందిస్తున్నామని తెలిపారు.

## రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో అవార్డు ప్రధానం

**టీ మీడియా, జూన్ 14, వనపర్తి బ్యూరో :**




నిస్వార్థ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలకు గుర్తింపు. రక్తదాన శిబిరాలు నిర్వహించి ఆపదలో ఉన్నవారికి సరైన సమయంలో రక్తదానం చేసి ప్రాణాలు కాపాడిన నిస్వార్థ ఆర్గనైజేషన్ సేవా కార్యక్రమాలను గుర్తించి ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా అత్యధికంగా రక్తదానం చేసిన స్వచ్ఛంద సంస్థ అవార్డుని తెలంగాణ రాజ్ భవన్ లో రెడ్ క్రాస్ రాష్ట్ర అధ్యక్షుడు అజయ్ మిశ్రా ఆధ్వర్యంలో నిస్వార్థ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు ప్యార్సాని అరవింద్ అందుకోవడం జరిగింది.

## రెండు లక్షల చెక్కును అందించిన జిఎంఆర్

**టీ మీడియా, జూన్ 14 ,జిన్నారం :**



మండల పరిధిలోని మంగంపేట గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ కార్యకర్త యేగుల మహిపాల్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. బిఆర్ఎస్ పార్టీ ప్రమాద బీమా ద్వారా మంజూరైన రెండు లక్షల రూపాయల చెక్కును కార్యకర్త కుటుంబానికి అందజేసిన పటాన్చెరువు శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి . కార్యకర్తలకు వెన్నుదన్నుగా నిలిచే ఏకైక పార్టీ బి ఆర్ ఎస్ పార్టీ అని తెలిపారు. హాజరైన జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, నగేష్ యాదవ్, నరేందర్, పార్టీ మండల అధ్యక్షులు రాజేష్, తదితరులు. పాల్గొన్నారు.

## రక్త దాన శిబిరం విజయవంతం

**టీ మీడియా, జూన్ 14 , ఖమ్మం**



రెడ్ క్రాస్ సంస్థ కార్యాలయం (వీడీఓ కాలనీ) నందు శుక్రవారం నిర్వహించిన రక్త దాన శిబిరంనకు పెద్ద ఎత్తున యువకులు 50 మంది తరలి వచ్చి రక్తం దానం చేసినట్టు నిర్వహకులు తెలిపారు. ఈ కార్యక్రమం నిర్వహణ రెడ్ క్రాస్ సంస్థ ఖమ్మం చైర్మెన్ డా.వి.చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి సాధినేని జనార్ధన్ ఆదేశాల అనుసరించి సంస్థ వైస్ చైర్మెన్ ఆర్.రవీందర్ రావు, కార్యదర్శి గుదిమళ్ల సూర్య ప్రకాశ రావు పర్యవేక్షణ బాధ్యత నిర్వహించారు. ఈ శిబిరంలో కొత్తా సత్యనారాయణ రెడ్డి, రిటైర్డ్ పోలీసు డిప్యూటి సూపరింటెండెంట్ నరసయ్య, అనాశి రాధాకృష్ణ, జెల్లా వెంకటేశ్వర్లు, మూలగుండ్ల శ్రీహరి, గజేంద్రుల నాగేశ్వర్ రావు, తాతా రాఘవయ్య, గట్టు మోహన్, మల్లం ఆంజనేయులు, టి.వెంకటేశ్వర్లు, మహమ్మద్ గౌసు, సాయి కుమార్, రహీం, గంట ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో కార్మికుల బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలి.

### - టీ ఎం సి డబ్ల్యూ యు (ఏ ఐ టీ యూ సీ) రాష్ట్ర కార్యదర్శి,

**టీ మీడియా, జూన్ 14, రేవల్లి**



వనపర్తి జిల్లా, రేవల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సూపర్వైజర్ కార్మికులకు బకాయిలు (పెండింగ్లో) ఉన్న నాలుగు నెలల వేతనాలు తక్షణమే చెల్లించాలని, తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ,(ఏ ఐ టీ యు సి ) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం రేవల్లి సి హెచ్ సి కార్మికులతో కలిసి ఆయన ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సందేశ్ కి జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని, అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న వెంకటయ్య సెక్యూరిటీ సర్వీసెస్ ఏజెన్సీ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ.... రేవల్లి ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో వెంకటయ్య సెక్యూరిటీ సర్వీసెస్ ఏజెన్సీ కాంట్రాక్టర్ ఆరు నెలల బిల్లులకు సంబంధించిన ప్రభుత్వ చెక్కులు తీసుకొని కేవలం రెండు నెలలు మాత్రమే వేతనాలు చెల్లించారని, ఇప్పటికీ కార్మికులకు నాలుగు నెలల వేతనాలు పెండింగ్లో ఉన్నాయని, ఎన్ని పర్యాయాలు అడిగిన వేతనాల చెల్లింపులు తీవ్రమైన అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. జీఓ 60 ప్రకారం వేతనాలు చెల్లించకుండా పిఎఫ్ ఈఎస్ఐ లో భారీ అక్రమాలకు పాల్పడుతున్నారని అన్నారు. వెంకటయ్య సెక్యూరిటీ సర్వీసెస్ ఏజెన్సీ పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఇప్పటికే అనేకసార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు కూడా చేయడం జరిగిందని అన్నారు. కార్మికులకు రావాల్సిన నాలుగు నెలల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సురేష్ వెంట ఆసుపత్రి కార్మికులు సిద్దు, నిరంజనమ్మ, వెంకటమ్మ, ఆషాభీ, జహీరా బేగం, నారాయణమ్మ, లక్ష్మి దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.